క్లుప్తంగా

పనులను త్వరితగతిన పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో ఉన్న వివిధ శాఖల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పీఓ కె.రాములు నాయక్ అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో అన్ని శాఖల అధికారులతో శాఖాపరమైన సమీక్ష నిర్వహించారు. పీఓ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడం, సమస్యలను సకాలంలో పరిష్కరించే దిశగా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో ఐటీడీఏ పరిధిలో ఉన్న అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య సేవలు



వైద్య సేవలు పొందుతున్న కార్మికులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం పారిశుద్ధ్య కార్మికులకు ఆలయ జంట గోపురాల ప్రాంతంలోని ప్రథమ చికిత్సా కేంద్రంలో మంగళవారం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. సుమారు 60 మందికి డాక్టర్ ఆర్ రాజేంద్రప్రసాద్ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి ఆదేశాల మేరకు ఈ శిబిరం ఈనెల 30 వరకు కొనసాగుతుందని వైద్యుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు



నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉద్యోగులు

కుక్కునూరు: కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి పెంచేలా అప్పగిస్తున్న పనులకు నిరసనగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు మంగళవారం సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వే, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలని, సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలని నిరసన చేపట్టామన్నారు.

హెల్మెట్‌లు ధరించాలి

పోలవరం రూరల్: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ బాలసురేష్ అన్నారు. పంచాయతీ పరిధిలోని యడ్లగూడెం గ్రామానికి చెందిన అక్కాబత్తుల లక్ష్మణరావు మిత్రుడు పాడుం శ్యామ్‌కుమార్ హెల్మెట్‌లను అందజేశారు. సీఐ బాలసురేష్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది గాయాలపాలై ప్రాణాలు కూడా కోల్పోతున్నారని తెలిపారు. హెల్మెట్ రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. 10 మంది యువకులకు హెల్మెట్లను అందించడం అభినందనీయమని తెలిపారు.

రామచంద్రరావుకు సన్మానం

జంగారెడ్డిగూడెం: స్థానిక బాపూజీ సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంఘ కార్యవర్గ సమావేశం జంగారెడ్డిగూడెంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ మాట్లాడుతూ కుకునూరి రామచంద్రరావు ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలు అందిస్తూ, ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్ సమాఖ్య ఉపాధ్యక్ష పదవికి ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. జంగారెడ్డిగూడెం నుంచి జాతీయ స్థాయికి ఎన్నిక కావడం ఎంతో గర్వకారణమన్నారు. సంఘ కార్యవర్గ సభ్యులు ఆయన్ని ఘనంగా సన్మానించారు. రామచంద్రరావు మాట్లాడుతూ తన సేవలు జాతీయ స్థాయిలో సీనియర్ సిటిజన్స్‌కు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి పీవీ రెడ్డి, కిడ్స్ యాజమాన్యం కేవీ రామారావు, కె.త్రినాథరావు, చామర్తి శ్రీరాములు, గుమ్మడి సుందర రామయ్య, కె.బాలకృష్ణ, కె.గాంధీ, కె.ఆంజనేయ శర్మ, ఆర్.రాజేంద్రప్రసాద్, రామానుజాచార్యులు, కాశేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్టీ హోదా కోరుతూ వంటా వార్పు

కామవరపుకోట: నాయకపోడు కులస్తులకు ఎస్టీ హోదా కల్పించాలంటూ డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం రెండో రోజు గ్రామస్తులు వంట వార్పు కార్యక్రమం నిర్వహించారు. రిలే దీక్ష కొనసాగించారు. ఈ దీక్ష మద్దతుగా సీపీఐ మండల నాయకులు టీవీఎస్ రాజు మద్దతు పలికారు. కార్యక్రమంలో ఆ కుల సంఘ నాయకులు రాంబాబు, గోధుమ మధుబాబు, నరసింహారావు, మేనుగుల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కాలనీలో ముళ్ల పొదలు

- కనీస సౌకర్యాలు కరువు
- ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు
- ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరుతున్న లబ్ధిదారులు



చింతలపూడిలో మోడల్ కాలనీలో నిలిచిన ఇళ్ల నిర్మాణ పనులు



ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డుపై పెరిగిన ముళ్ల పొదలు

చింతలపూడి : ఆ కాలనీలో అడుగు పెట్టడానికి లబ్ధిదారులు జంకుతున్నారు. అప్పట్లో అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల కళకళలాడాల్సిన ఆ కాలనీ రెడు దశాబ్దాలుగా కళతప్పి అధ్వానంగా మారింది. నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడి మోడల్ కాలనీ సమీపంలో 2006లో ప్రభుత్వం రెండున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేసి 75 మంది నిరుపేదలను గుర్తించి, ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేసింది. వీరికి అప్పట్లోనే ఇందిరమ్మ పథకంలో ఇళ్లు మంజూరు చేశారు. పంపిణీ సమయంలో సరైన లే అవుట్ చేయక పోవడం, రోడ్డు సౌకర్యం కూడా కల్పించక పోవడంతో లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. బయటి నుంచి ఇళ్ల నిర్మాణ సామగ్రి తెచ్చుకునేందుకు సరైన రహదారి సౌకర్యం లేక లబ్ధిదారులు నేటికీ ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. కొందరు నిర్మాణాలు మొదలు పెట్టినా సౌకర్యాలు లేక పోవడంతో మధ్యలోనే పనులు నిలిపేశారు. ఈ కాలనీకి వెళ్లడానికి రోడ్డు ఎక్కడుందో ఎవరూ చెప్పలేక పోతున్నారు. ప్రస్తుతం కాలనీ అంతా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయి ఉంది. ముందుచూపు లేకుండా పట్టాలు పంపిణీ చేసిన ప్రభుత్వం రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించక పోవడంతో గత 19 ఏళ్లుగా ఈ ఇందిరమ్మ కాలనీ ఆలనా, పాలనా కరువై దిక్కూ, మొక్కూ లేక పడిఉందని విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించక పోవడం, మార్కెట్లో సిమెంట్, ఇసుక, ఐరన్‌తో పాటు కూలి ధరలు పెరిగి పోవడంతో ఇళ్ల నిర్మాణంపై నీలి నీడలు అలుముకున్నాయి. సమస్యను అనేకసార్లు స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ కాలనీకి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి



ఇందిరమ్మ కాలనీకి ప్రభుత్వం వెంటనే మౌలిక సౌకర్యాలు కల్పించాలి. ఇళ్ల కాలనీ మంజూరు చేసి 20 ఏళ్లు గడుస్తున్నా కనీసం రోడ్డు సౌకర్యం కల్పించక పోవడం దారుణం. వెంటనే రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలి.

– తొర్లపాటి బాబు, సీపీఐ మండల కార్యదర్శి, చింతలపూడి

రోడ్డు సౌకర్యం లేదు



ఇందిరమ్మ పథకంలో ఇళ్లు మంజూరు చేశారు. కాలనీకి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేదు. పొలాలకు అడ్డం పడి వెళ్లాల్సి వస్తుంది. వర్షాకాలం అయితే కాలనీలోకి వెళ్లడం కష్టం. రోడ్డు సౌకర్యం కల్పిస్తే ఇళ్లు నిర్మించుకుంటాం.

– ఎస్‌కే అహ్మద్, మోడల్ కాలనీ, చింతలపూడి

కాలువల గండ్లు పూడ్చాలి



అధికారులకు సమస్యలు వివరిస్తున్న రైతులు

పోలవరం రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండకాలువలు పొంగి ప్రవహించడంతో కాలువ గట్లకు పడిన గండ్లను పూడ్చాలని నీటి సంఘం అధ్యక్షుడు పాదం ప్రసాద్, రైతులు అధికారులను కోరారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఆర్ఎస్ రాజు, మైనర్ ఇరిగేషన్ డీఈ వరప్రసాద్, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబులకు సమస్యను తెలిపారు. ఇసుక కాలువకు పడిన గండ్ల కారణంగా పొలాల్లో ఇసుక మేటలు వేస్తున్నాయని, ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. వెంటనే కాలువ గండ్లు పూడాల్చని రైతులు విజ్ఞప్తి చేశారు. దీంతో గండ్లు పడిన ప్రదేశాలను అధికారులు పరిశీలించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు ఏర్పాటు చేస్తామన్నారు.

వర్జీనియా ధరలపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు ప్రతినిధులు

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు ధరల పెరుగుదలపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని స్థానిక వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది పేర్కొన్నారు. మంగళవారం పొగాకు వేలం కేంద్రంలో రైతు ప్రతినిధులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. దాదాపు 70 ఏళ్ల వర్జీనియా చరిత్రలో రూ.430 గ్రేటెస్ట్ ధర పలికి ఆల్ టైం రికార్డ్ సృష్టించిన్నారు. ప్రస్తుత సీజన్లో రూ.209తో ప్రారంభమైన కేజీ పొగాకు ధర రూ.430కు చేరడం హర్షణీయమన్నారు. రైతు ప్రతినిధులు ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, మద్దుపోయిన శ్రీను, దగ్గు సత్తిబాబు, అడపా సత్తిబాబు, దుగ్గిరాల బోసు, యాగంటి సుధాకర్, రాఘవరావు, గద్దె సురేష్, తోటకూర శ్రీనివాస్, పల్లి గణపతి, పారేపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

కామవరపుకోట: మండలంలో ఎరువుల షాపుల్లో మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఎస్సై కె.నాగరాజు బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కామవరపుకోటలోని ఎరువులు షాపులైన మెస్సర్స్ కొండూరు రామమోహనరావు, మెస్సర్స్ కొండూరు నాగేశ్వరరావు, మెస్సర్స్ బచ్చు కృష్ణమూర్తి ఎరువులు షాపుల్లో తనిఖీ చేశారు. ఎస్సై కె.నాగరాజు మాట్లాడుతూ ఎరువుల నిల్వల స్టాకు వివరాలు, ధరలు రైతులకు కనిపించే విధంగా తప్పనిసరిగా షాపు ఆవరణంలో ఉంచాలన్నారు. ఎరువుల కొనుగోలు, అమ్మకం బిల్లులు రైతులకు ఇవ్వాలని, లేకుంటే ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పోలాసిగూడెం అధ్యక్షుడిగా లక్ష్మణ కుమార్



గ్రామ కమిటీ సభ్యులతో మండల కన్వీనర్ సత్యనారాయణ

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీ పోలాసిగూడెం గ్రామ అధ్యక్షుడిగా బూరుగుపల్లి లక్ష్మణ్ కుమార్ ఏకగ్రీవగా ఎన్నికయ్యారు. పార్టీ చింతలపూడి నియోజకవర్గం కన్వీనర్ కంభం విజయరాజు ఆదేశాల మేరకు మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ అధ్యక్షతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా మట్టా నాగరాజు, పామర్తి రామకృష్ణ, బలుసు నాగేంద్ర ప్రసాద్, దొండపాటి రవికుమార్, కార్యదర్శులుగా గాదె హనుమరెడ్డి, కోడూరు రవిశంకర్, బూరుగుపల్లి సురేష్, మట్టా రాంబాబులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తడికలపూడి సొసైటీ మాజీ అధ్యక్షులు గుర్రాల రవికుమార్, కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్, రామన్నపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు ఉప్పలపాటి మోహన్‌రావు, రామన్నపాలెం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ నార్ని సతీష్, గాదె రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవీ నమోస్తుతే



జంగారెడ్డిగూడెం గంగానమ్మ



జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ



జంగారెడ్డిగూడెం వాసవీ కన్యకాపరమేశ్వరి



చింతలపూడి విశ్వనాథ మఠంలో..



గాయత్రీదేవిగా పోలవరం కనకదుర్గమ్మ



కన్నాపురంలో గాయత్రీ దేవి అలంకరణలో..

జంగారెడ్డిగూడెం: దసరా ఉత్సవాల్లో భాగంగా జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలో అమ్మవార్లు గాయత్రీదేవి అలంకరణలో పూజలందుకున్నారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. గాయత్రీదేవి అలంకరణలో గంగానమ్మ, నూకాలమ్మ, వాసవీ కన్యకాపరమేశ్వరి, హైస్కూల్ వద్ద ఉన్న కనకదుర్గమ్మవార్లు, బాలా త్రిపుర సుందరిగా ముత్యాలమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నూకాలమ్మ అమ్మవారి వెండి చీర తయారీకి స్థానిక చిన్ని వెంకట నాగేశ్వరరావు విజయశ్రీ దంపతులు 10 తులాల వెండిని సమర్పించారని ఆలయ శాశ్వత చైర్మన్ డాక్టర్ రాజాన పండు తెలిపారు. గురవాయగూడెం అయ్యప్ప స్వామి ఉపాలయమైన జ్ఞాన సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణాదేవిగా..

చింతలపూడి: పట్టణంలోని శివాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. పలు ప్రాంతాల్లో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవార్లు భక్తులకు దర్శనమించాఈరు. ఆశ్రమంలో రాజరాజేశ్వరీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

గాయత్రీదేవిగా దర్శనం

పోలవరం రూరల్: కనకదుర్గమ్మ వారు గాయత్రీదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు అందుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గాయత్రి అలంకరణలో..

టి.నరసాపురం: గాయత్రీ దేవిగా అలంకరించి అమ్మవార్లు ప్రత్యేక పూజలు అందుకున్నారు. టి.నరసాపురం కనకదుర్గమ్మ, గీతా మందిరం వద్ద, తిరుమలదేవిపేట, మక్కినవారిగూడెం, బండివారిగూడెం, బొర్రంపాలెం, అప్పలరాజుగూడెం తదితర గ్రామాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వేదమాతగా కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: కనకదుర్గమ్మ వేదమాత గాయత్రీదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. కన్నాపురం, కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం, వై జంక్షన్ ఆలయాలలో గాయత్రీ దేవి అలంకరణతో అమ్మవారు పూజలు అందుకున్నారు. వాసవి మాత ఆలయంలో బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులు దర్శనమించారు. గాయత్రి పీఠంలో మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు.

బహుళ పంటలతో అధిక లాభాలు

కామవరపుకోట: బహుళ పంటలతో అధిక లాభాలు పొందవచ్చునని వ్యవసాయ శాఖ డైరెక్టర్ పి.చౌడప్ప అన్నారు. మంగళవారం మండలం లో కోకో, బహుళ పంటల తోటలను ఉద్యాన శాఖ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. తడికలపూడిలో బోయపాటి వెంకటేశ్వరరావు కోకో ప్రైమరీ, మినీ ప్రాసెసింగ్ యూనిట్ ను, రత్నగిరినగర్‌లో ఇంజినీర్ ప్రసాద్ కోకో సీడ్స్ గార్డెన్‌ను సందర్శించారు. కోకో అంతర పంటగా కొబ్బరిలోనే కాకుండా ఆయిల్‌పామ్‌ను 9 మీ. ఇంటూ 9 మీ. లేదా 10 మీ. ఇంటూ 10 మీ. దూరంలో నాటుకుని, అరటినీ నీడ పంటగా నాటుకొని, కోకోని వేసుకుంటే కూడా మంచి లాభలు ఉంటాయని తెలిపారు. పంట కోత అనంతరం నిర్వహణ పద్ధతిగా పాటిస్తే గింజ నాణ్యత పెరిగి మంచి ధర వస్తుందన్నారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్ రామ్మోహన్, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.సంతోష్, మండల ఉద్యాన శాఖ అధికారి మెడబాల రత్నమాల, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సీహెచ్‌సీ నిర్మాణానికి స్థల పరిశీలన

ద్వారకాతిరుమల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. ఈ క్రమంలో తహసీల్దార్ జేవీ సుబ్బారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, పలువురు టీడీపీ నేతలు మంగళవారం భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు.

హమాలీల ధర్నా

కుక్కునూరు: హమాలీ పెండింగ్ వేతనాలు త్వరలోనే చెల్లించనున్నట్టు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారని జీసీసీ గోడౌన్ ఇన్‌చార్జి రామకృష్ణ మంగళవారం తెలిపారు. సోమవారం హమాలీలు జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్ ఎదుట పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా చేసి, వినతి పత్రం అందించారని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి

ద్వారకాతిరుమల: కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోరాడాలని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా సూచించారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన ద్వారకాతిరుమలకు చెందిన పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ జక్కంపూడిని రాజమండ్రిలోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శి షేక్ మస్తాన్ బాషా, పార్టీ ద్వారకాతిరుమల మండల మహిళా అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు, ప్రభుత్వం తీరుపై నిరసన

జంగారెడ్డిగూడెం: నేవీ ఆయుధ కర్మాగారం ఫ్యాక్టరీ వద్దని వామపక్ష పార్టీలు గిరిజన ప్రజాసంఘాలు తలపెట్టిన పాదయాత్ర ర్యాలీని అడ్డుకొని అక్రమ నిర్బంధం చేసి, నాయకులపై దాడి చేసిన పోలీసుల వైఖరిని ఖండిస్తున్నట్టు సీపీఎం జంగారెడ్డిగూడెం మండల కమిటీ తెలిపింది. ఈ మేరకు స్థానిక పంగిడిగూడెం రోడ్డు సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు పి.సూర్యారావు చ ఎం జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

జంగారెడ్డిగూడెం: మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. ఐసీడీఎస్ జంగారెడ్డిగూడెం సెక్టార్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం 2025 కార్యక్రమాన్ని ఏడో రోజు సెక్టార్ సీడీపీఓ పి.బ్యూల ఆధ్వర్యంలో స్థానిక 6వ వార్డు హరిజనపేటలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఉత్పత్తులు, బొమ్మలు, పోషకాహార పదార్థాలపై అవగాహన, బొమ్మల తయారీ, స్థానిక వంటలను ప్రదర్శించారు.

పౌష్టికాహారంపై అవగాహన

కామవరపుకోట: మండలంలోని కేస్ రామవరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శారద మాట్లాడారు. జంగారెడ్డిగూడెం అంగన్వాడీ సెక్టార్ పీడీ పి.బ్యూల, సూపర్‌వైజర్ బీవీఎల్ మంగాదేవి, ఎన్ వీరకుమారి అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పొదలను తొలగించిన కానిస్టేబుల్

కుక్కునూరు: కుక్కునూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సుకుమార్ మంగళవారం గ్రామంలోని సబ్‌స్టేషన్, జూనియర్ కళాశాల మధ్యలో గల టీ జంక్షన్‌కు అటు, ఇటు దట్టంగా పెరిగిన చెట్ల పొదలను తన సొంత సొమ్ము ఖర్చు చేసి జేసీబీ సాయంతో తొలగింపజేవారు. దీంతో గ్రామస్తులు కానిస్టేబుల్‌ను అభినందించారు.

పుల్లల లోడు ట్రక్ బోల్తా

జంగారెడ్డిగూడెం: మండలంలోని దేవులపల్లిలో పుల్లలలోడుతో వెళుతున్న ట్రాక్టర్ ట్రక్ తిరగబడింది. గ్రామ శివారులోని వల్లభ డైరీ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

కచ్చా డ్రెయిన్ల నిర్మాణం

పోలవరం రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు వీధుల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా కచ్చా డ్రెయిన్ల నిర్మాణం చేపట్టినట్లు కొత్త పట్టిసీమ సర్పంచ్ మైగాపుల విజయదుర్గ తెలిపారు. ఈ పనులను మంగళవారం ఆమె ఎంపీపీ సుందర వెంకటరెడ్డితో కలిసి పరిశీలించారు. రోడ్డుపై ఎక్కడా మట్టి లేకుండా శుభ్రం చేసి, వర్షం, మురుగునీరు వెళ్లే విధంగా ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ను ఆదేశించారు. ప్రజలు ఎవరూ ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. వీరి వెంట మైగాపుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కొప్పుల రవిచంద్రారెడ్డిని అభినందిస్తున్న కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజును స్టూడెంట్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి కొప్పుల రవిచంద్రారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిన పార్టీ పెద్దలతో పాటు, విజయరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. రవిచంద్రారెడ్డిని దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు. పంగిడిగూడెం సర్పంచ్ కె.వెంకట్, పార్టీ మాజీ అధ్యక్షుడు మాంద్రు చంద్రరావు, పంపన వీరాస్వామి, పార్టీ జంగారెడ్డిగూడెం పట్టణ ప్రధాన కార్యదర్శి చిప్పాడ నరసింహారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతలపూడి : పాత చింతలపూడి, శంఖుచక్రపురం సబ్ స్టేషన్ పరిధిలోని సత్య సాయి ఫీడర్, తిమ్మిరెడ్డిపల్లి ఫీడర్లకు బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరమ్మతుల నిమిత్తం ఆయా ఫీడర్ల పరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ మంగళవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలాత్రిపుర సుందరీదేవిగా..



ద్వారకాతిరుమలలోని కన్యకాపరమేశ్వరి

ద్వారకాతిరుమల: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద, పోలీ స్టేషన్ సమీపంలో, వేంపాడు, దొరసానిపాడులో కొలువుతీరిన అమ్మవార్లు విశేష పూజలు అందుకున్నారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.